## క్లుప్తంగా

### ఆరోగ్య మిత్రకు అవార్డు అందజేత



కుమారికి ఆరోగ్య సేవా మిత్ర అవార్డు అందజేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

**అమలాపురం రూరల్:** పట్టణంలో ఆరోగ్య మిత్రగా పనిచేస్తున్న అంగాని కుమారికి సోమవారం ఆరోగ్య సేవా మిత్ర అవార్డు, రూ.5 వేల నగదు పురస్కారాన్ని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతుల మీదుగా సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ లబ్ధిదారులకు అత్యుత్తమ సేవలందించినందుకు గుర్తింపుగా ఈ అవార్డు అందజేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఆంద్రో, టీం లీడర్ వంగ రవి తదితరులు పాల్గొన్నారు.

### ఉత్తమ ప్రదర్శనగా 'స్వీకారం' నాటిక

**అమలాపురం టౌన్:** తిరుపతిలో నిర్వహించిన జాతీయ స్థాయి హనుమా అవార్డ్స్ నాటికల పోటీల్లో అమలాపురం రస వాహిని సంస్థ ప్రదర్శించిన 'స్వీకారం' నాటిక ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా నిలిచిందని నటుడు, దర్శకుడు షహన్ షా తెలిపారు. ఉత్తమ ద్వితీయ ప్రదర్శనకు గాను రూ.40 వేల నగదు బహుమతితో పాటు రోలింగ్ షీల్డ్ లభించాయన్నారు. అలాగే ఉత్తమ క్యారెక్టర్ నటుడిగా నాటిక దర్శకుడు షహన్ షా, ఉత్తమ సహాయ నటిగా రాజేశ్వరి, ఉత్తమ రచయితగా రావి నాగేశ్వరరావులు బహుమతులు అందుకున్నారు. తిరుపతిలో ఆదివారం జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారని చెప్పారు. రస వాహిని సంస్థ ప్రతినిధులను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి తదితరులు అభినందించారు.

### రోడ్లపై ఆవుల ప్రక్షాళనకు ప్రయత్నం

**అమలాపురం టౌన్:** పట్టణంలోని రోడ్లపై యథేచ్ఛగా తిరుగుతున్న ఆవుల ప్రక్షాళనకు మున్సిపాలిటీ ఓ సరికొత్త ప్రయత్నం చేస్తోంది. వార్డుల పరిధిలో ఆవులను రోడ్లపైకి వదిలేస్తున్న యజమానుల వివరాలను కౌన్సిలర్లు, వలంటీర్ల సహకారంతో సేకరించి సదరు యజమానులకు మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు కౌన్సిలింగ్ ఇవ్వనున్నారు. అప్పటికీ వారిలో మార్పు రాకపోతే వారి యజమానులకు భారీ జరిమానాలు వేయడం లేదా వారి ఆవులను నేరుగా జంతు హింస నివారణ కేంద్రాలకు తరలించనున్నారు. ఇదే అంశంపై మున్సిపాలిటీ పట్టణంలో మైక్ అనౌన్స్‌మెంట్ చేయిస్తోంది. అలాగే ఆవులను కలిగి రోడ్లపై వదిలేస్తున్న యాజమానుల ఫోన్ నెంబర్లు, ఆవుల ఫొటోలు మున్సిపల్ కమిషనర్ ఫోన్ నెంబరు 98499 05805కు వాట్సాప్ ద్వారా తెలియజేయొచ్చు.

### విధులు బహిష్కరించి న్యాయవాదుల నిరసన

**అమలాపురం టౌన్:** విజయవాడకు చెందిన న్యాయవాది ఆదిశేషు విఠల్‌బాబు హత్యకు నిరసనగా అమలాపురం న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించారు. అనంతరం కోర్టు భవన సముదాయం గేట్ వద్ద న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. న్యాయవాదులకు రక్షణ చట్టం తీసుకురావాలని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నిరసనలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యూపీ లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడు కుడుపూడి త్రినాథ్, కార్యదర్శి బడుగు భాస్కర్ జోగేష్, సీనియర్ న్యాయవాదులు ఎండీ ఆజామ్, కుడుపూడి అశోక్, పినిపే రాధాకృష్ణ, మాకే ఆదినారాయణ పాల్గొన్నారు.

### ఆర్టీసీ డిపోలో సమస్యలను పరిష్కరించాలి

**అమలాపురం రూరల్:** స్థానిక ఆర్టీసీ డిపోలో కార్మికులను ఇబ్బంది పెడుతున్న పలు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ద ఏపీఎస్ పీటీడీ జేఏసీ కమిటీ అమలాపురం డిపో శాఖ డిపో మేనేజర్‌కు సోమవారం విజ్ఞప్తి చేసింది. ఐదు అంశాలతో కూడిన సమస్యలను ఆ కమిటీ ప్రతినిధులు డిపో మేనేజర్ సత్యనారాయణమూర్తికి వినతి పత్రం ద్వారా తెలియజేశారు. కమిటీ ప్రతినిధులు పి.రాంబాబు, ఎస్ఎస్‌వీ గణేష్, ప్రసాద్, దొరబాబు, పీఎన్‌కేడీ రావు, మణిరాజు, కేవీవీఎస్ నారాయణ, సీహెచ్ రావు, జంగా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

**యానాం:** అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి సోమవారం సామాజిక కార్యకర్త మోకా సూకరాజు(బుజ్జి) ఆధ్వర్యంలో ఆర్థిక సాయం చేశారు. యానాం నియోజకవర్గ శివారు దరియాలతిప్ప సూకాలమ్మగుడి సమీపంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంతో గుర్రం వెంకటరమణ తాటాకు పాక దగ్ధమవ్వడంతో కట్టుబట్టలతో మిగిలారు. బాధిత కుటుంబ సభ్యులకు మోకా సూకరాజు రూ.5 వేల నగదు, 50 కేజీల బియ్యాన్ని సోమవారం అందజేశారు.



పునరావాస కేంద్రంలో వరద బాధితులకు భోజనాలు వడ్డిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్



కేశనకుర్రులోని ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్



గౌతమీ గోదావరి వరద పరిస్థితిపై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే అశోక్



యానాంలో పుష్కరమాత విగ్రహం పక్క నుంచి వరద ప్రవాహం



చింతపల్లిలంకలో బాధితులకు భోజన వసతి కల్పిస్తున్న అధికారులు

# తప్పని ముప్పు.. వీడని వరద

- ముమ్మరంగా సాగుతున్న సహాయక చర్యలు
- బాధితులను ఆదుకుంటాం: ఎమ్మెల్యే పొన్నాడ, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

**ముమ్మిడివరం/ఐ.పోలవరం/అల్లవరం/తాళ్లరేవు:** ఎగువన గోదారమ్మ శాంతించినా లంక గ్రామాల ప్రజలకు మాత్రం ముంపు బెడద తప్పడం లేదు. ముంపు గుప్పిట్లో చిక్కుకున్న ఎన్నో గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. రహదారులు జల దిగ్బంధంలో ఉండటంతో అత్యవసర పరిస్థితుల్లో నాటు పడవల్లో ప్రయాణిస్తున్నారు. వరద బాధితులను ఆదుకునేందుకు అధికార యంత్రాంగం ముమ్మరంగా సహాయక చర్యలు చేపట్టింది. పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేసి బాధితులకు అక్కడే భోజనం పెడుతున్నారు. ముంపు గ్రామాలన్నింటికీ ప్రత్యేక పడవల్లో ఆహార పొట్లాలు తీసుకెళ్లి పంపిణీ చేస్తున్నారు.

**నిండా ముంచిన వరద**

- ముమ్మిడివరం మండలంలోని లంకాఫ్ ఠానేల్లంక, మత్స్యకార కాలనీ, గురజాపులంక, కమిని, సలాదివారిపాలెం, చింతపల్లి లంక, చింతావాని రేవు గ్రామాలు ముంపు బారినపడ్డాయి. వరద ప్రభావిత ప్రాంతాలలో అధికారులు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి సహాయక చర్యలు చేపట్టారు. ఆయా గ్రామాలలో బాధితులకు భోజనం, మంచినీటి వసతి కల్పించారు.
- అల్లవరం మండలం బోడసకుర్రు వద్ద వైనతేయ నదిలో వరద సోమవారం నాటికి మరింత ఉధృతమైంది. మత్స్యకారులకు చెందిన 80 ఇళ్లు వరద నీటిలో చిక్కుకున్నాయి. మత్స్యకార కాలనీతో పాటుగా కంసాలమామిడి, గౌతమినగర్, గోపాయి లంకల్లో పలు ఇళ్లల్లోకి వరద నీరు చేరింది. ఆయా ప్రాంతాల్లో నాలుగు రోజులుగా వరదలో చిక్కుకున్న బాధిత కుటుంబాలకు పడవలపై తాగు నీరు, భోజనాలను అందిస్తున్నారు.



అన్నంపల్లి అక్విడెక్టు వద్ద వరద ఉధృతి

- ముంపు ప్రాంతాల్లో చిక్కుకున్న ప్రజలు తక్షణమే ప్రభుత్వ పునరావాస కేంద్రాలకు వెళ్లాలని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ సూచించారు. ముంపునకు గురైన ఐ.పోలవరం మండలం కేశనకుర్రు పంచాయతీ పరిధి పాగాకులంక, పెదలంక, పల్లెగూడేల్లో ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి, మండల పార్టీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు తదితరులతో కలిసి ప్రత్యేక పడవపై వెళ్లి ప్రజలకు ధైర్యం చెప్పారు. అనంతరం మురమల్ల రాఘవేంద్రవారధి చెంతన నివాసముంటున్న కుటుంబాలను, పడవలపై నివసిస్తున్న కుటుంబాలను ఎమ్మెల్యేలు పరామర్శించారు.
- కేశనకుర్రు పంచాయతీ పరిధిలో పాగాకులంక, పల్లెగూడెం, జాంబవానిపేటల్లో సుమారు 700 మంది వరద బాధితులకు తాగునీరు, ఆహార పొట్లాలు అందజేశారు. ఎదుర్లంకలోని పునరావాస కేంద్రంలో ఉన్న 29 మందికి అధికారులు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు.
- ముంపుబారిన పడిన తాళ్లరేవు మండలం కొత్త లంక గ్రామంలో సోమవారం కాకినాడ ఆర్డీఓ ఎస్‌వీవీ సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కేవీవీ చౌదరి, డీఈ కె.శ్రీదేవి, ఏఈ మారుతీరావు, ఎంపీడీఓ ఎం.అనుపమ, తహసీల్దార్ ఎస్.పోతురాజు, ఈఓపీఆర్‌డీ మల్లాడి భైరవమూర్తిలు పర్యటించి వరద బాధితులను పరామర్శించారు. జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్ నేతృత్వంలో వరద బాధితులకు తాగునీటిని సరఫరా చేశారు.

**బాధితులను అన్ని విధాలా ఆదుకుంటాం**

వరద ప్రభావిత ప్రాంతాల్లో బాధితులను ప్రభుత్వపరంగా అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పేర్కొన్నారు. ముమ్మిడివరం మండలంలోని అన్నంపల్లి శివారు చింతపల్లిలంక, కర్రివానిరేవు పంచాయతీ శివారు చింతావానిరేవులో వరద ముంపు ప్రాంతాలను సోమవారం ఆయన పర్యటించి బాధితులను పరామర్శించారు. ఆయన వెంట నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెన్మత్స చిట్టిరాజు, కోలా బాబ్జి, చింతా నాగమునీంద్రరావు, కాశి జగపతిరావు, మట్టపర్తి సత్యనారాయణ, పాము చిట్టిబాబు తదితరులున్నారు. బోడసకుర్రు మత్స్యకార కాలనీని సందర్శించిన ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ సైతం ఆపదలో అండగా ఉంటానంటూ ప్రజలకు భరోసా కల్పించారు. స్థానిక ఎంపీపీ పాఠశాలలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించి వరద బాధితులకు భోజనాలు వడ్డించారు. ఆయన వెంట ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, వైఎస్ ఎంపీపీ వడ్డి గంగ, సర్పంచ్ రొక్కాల నాగేశ్వరరావు, ఎంపీటీసీ రాజేశ్వరి, తహసీల్దార్ సాంబశివప్రసాద్, ఎంపీడీఓ కృష్ణమోహన్ తదితరులున్నారు.

**కాట్రేనికోన:** మండల పరిధిలోని నడవపల్లి, పల్లంకుర్రురేవు, బూలవారి గట్టు తదితర ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పర్యటించారు. వరద బాధితులకు అందుతున్న భోజన వసతులను పరిశీలించారు.

### లంకభూములకు నష్టం

**యానాం:** రాజీవ్ రివర్ బీచ్, పుష్కర ఘాట్ తదితర ప్రాంతాల్లో సోమవారం వరద నీరు కొద్ది మేర వెనక్కి మళ్లింది. జీసెస్‌స్టాట్యూ నుంచి శివమ్‌బాత్ వరకూ ఉన్న రాజీవ్‌బీచ్ రహదారిలో వరదనీరు ఇంకా అలాగే ఉండటంతో సందర్శకులను పోలీసులు అనుమతించడం లేదు. అయితే దరియాలతిప్ప తదితర ప్రాంతాల్లో లంకభూములకు నష్టం ఏర్పడి వరద ఉధృతికి పొలాలు కోతకు గురవడంతో భూమి గోదావరిలో పడిపోయింది. ఎమ్మెల్యే అశోక్ ముంపు ప్రాంతాల్లో ఆర్ఏఓ మునిస్వామి, పీడబ్ల్యూడీ అధికారులతో కలిసి ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ సోమవారం విస్తృతంగా పర్యటించారు. యానాం–ఎదుర్లంక బాలయోగివారధి వద్ద గోదావరి ఉధృతిని పరిశీలించారు.



చింతపల్లిలంకలో నీట మునిగిన ఇళ్లు



పిల్లంక శివారు కొత్తలంకలో వరద బాధితులకు తాగునీరు సరఫరా చేస్తున్న అధికారులు



వరద బాధితులకు భోజనం వడ్డిస్తున్న నాయకులు



కాట్రేనికోన మండలంలో ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- మంత్రి విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్
- రంగాపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం



రంగాపురంలో జరిగిన గడప గడపకూ కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్ తదితరులు

**అమలాపురం రూరల్:** అర్హులందరికీ సంక్షేమ పథకాలను దరి చేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్ అన్నారు. మండలంలోని రంగాపురంలో సోమవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లుగా ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దంగేటి డోలామణి, వైస్ చైర్మన్ బడుగు మేరి, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, సెంట్రల్ డెల్టా బోర్డ్ చైర్మన్ కుడుపూడి వెంకటేశ్వరబాబు, మండల కోఆప్షన్ సభ్యుడు మొసలి స్వర్గన్ రాజు, ఎంపీటీసీలు ఉడుం రామకృష్ణ, రేవుశ్రీను కర్రెళ్ల రమేష్, పాలమూరి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మాదిగలను గుర్తించిన సీఎం జగన్



సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న సంఘం నాయకులు

**అమలాపురం టౌన్:** గత 75 సంవత్సరాలుగా రాజకీయంగా, సామాజికంగా, విద్యాపరంగా అన్ని విధాలా నష్టపోయిన మాదిగలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే గుర్తించి తగిన ప్రాధాన్యమిస్తున్నారని రాష్ట్ర మాదిగ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు మడికి శ్రీరాములు అన్నారు. అమలాపురం ఎత్తురోడ్డు సమీపంలోని విక్టోరియాపేటలో సోమవారం జరిగిన సమావేశానికి రాములు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లోనూ మాదిగలకు రాజకీయంగా తగిన ప్రాధాన్యమివ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సవరపు నానిబాబు, నేదునూరి వెంకటరెడ్డి, సరవపు ప్రసాద్, ఎస్.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ముంపునకు గురైన పొలాల పరిశీలన



అయినాపురంలో ముంపునకు గురైన నారుమడిని పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

**ముమ్మిడివరం:** మండలంలోని అయినాపురంలో వరదలు, వర్షాల వల్ల ముంపునకు గురైన వరిచేలు, నారుమళ్లను వ్యవసాయ శాస్త్రవేత్తలు వి.గౌరి, పీబీ ప్రదీప్‌కుమార్‌లు సోమవారం పరిశీలించారు. నీట మునిగిన నారుమడిలో ఎక్కువగా ఉన్న నీటిని వీలైనంత త్వరగా తీసి వేసి 5 సెంట్ల నారుమడిలో ఒక కిలో యూరియా, ఒక కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయాలన్నారు. అలాగే తెగుళ్ల బారిన పడకుండా నీటిని తొలగించి మొక్క నిలదొక్కుకున్న తరువాత లీటరు నీటికి ఒక గ్రాము కార్బెండజిమ్, లేదా 2 గ్రాముల మాంకోజెబ్ + కార్బెండజిమ్ కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలని సూచించారు. పంట ఊడ్చిన వెంటనే ఎకరాకు 20 కిలోల యూరియా, 20కిలోల మ్యూరేటాఫ్ పొటాష్, బూస్టర్ డోసుగా వేసుకోవాలన్నారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ ఏవీ రాజశేఖర్, ఏఓ ప్రశాంత కుమార్, వీఏఏలు పాల్గొన్నారు.

## మణిపూర్ ఘటనలను నిరసిస్తూ ర్యాలీ



ముమ్మిడివరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాలు

**ముమ్మిడివరం:** మణిపూర్ ఘటనలను నిరసిస్తూ ముమ్మిడివరంలో సోమవారం సీఐటీయూ, సీపీఎం, ఆర్‌పీఐ, విద్యార్థి సంఘాలు, కార్మిక సంఘాలు, కేవీపీఎస్, ముస్లిం సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక కాశివారి తూము వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీగా వెళ్లి డిప్యూటీ తహసీల్దార్ యడ్ల రాంబాబుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జీసస్ క్రీస్తు ఫెలో షిప్ సంఘ అధ్యక్షుడు పాల్‌రాజు, ఉండ్రాజవు ప్రసాద్, పి.సుధీర్, జి.దుర్గాప్రసాద్, సఖిలే సూర్యనారాయణ, పాము బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ కట్టడాన్ని నిలిపేయాలని ఆందోళన



జార్జిపేట శ్రీరామకాలనీలో చర్చి నిర్మాణాన్ని నిలిపేయాలంటూ ఆందోళన చేస్తున్న స్థానికులు

**తాళ్లరేవు:** మండలంలోని జార్జిపేట పంచాయతీ శ్రీరామకాలనీలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న చర్చి నిర్మాణాన్ని తక్షణమే నిలిపేయాలని కోరుతూ గ్రామస్తులు ఆందోళన నిర్వహించారు. సోమవారం తాళ్లరేవు తహసీల్దార్ కార్యాలయం వద్ద గ్రామస్తులు ఈఎస్ఎన్ ప్రకాష్ ఆధ్వర్యంలో నిరసన తెలిపి అనంతరం తహసీల్దార్ పోతురాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మతపరమైన కట్టడాలకు జిల్లా కలెక్టర్ అనుమతి తప్పనిసరి అని, ఎటువంటి అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా నిర్మిస్తున్న కట్టడాన్ని నిలిపేయడంతో పాటు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### ఈడబ్ల్యూఎస్‌పై అభ్యంతరాలుంటే తెలపండి

**యానాం:** యూడీసీ ఉద్యోగాలకు అభ్యర్థుల మెరిట్ జాబితాను ప్రకటించిన నేపథ్యంలో వారికి ఈడబ్ల్యూఎస్(ఎకనామికల్లీ వీకర్ సెక్షన్) ధ్రువపత్రాల జారీపై ఎవరికైనా అభ్యంతరాలుంటే ఈ నెల 14వ తేదీలోగా తెలియజేయాలని డిప్యూటీ తహసీల్దార్(రెవెన్యూ) సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. యానాం నుంచి మొత్తం 10 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని, వారిలో ఏడుగురు ఈడబ్ల్యూఎస్ కోటాలో, ఒకరు ఎస్సీ, ఒకరు ఎస్టీ, మరొకరు వెనకబడిన తరగతి ముస్లింలు(బీసీఎం) ఉన్నారని అదేవిధంగా వెయిటింగ్ లిస్ట్‌లో మరో ఐదుగురు ఉన్నారన్నారు.

### వరద బాధితులకు సాయం



వరద బాధితులకు ఆహార పొట్లాలు అందజేస్తున్న కళాశాల యాజమాన్యం, విద్యార్థులు

**అమలాపురం టౌన్:** బోడసకుర్రు, పాశర్లపూడి గ్రామాల్లోని వరద బాధితులకు అమలాపురం శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల యాజమాన్యం, విద్యార్థులు ఆహార పదార్థాలను సోమవారం పంపిణీ చేశారు. అమలాపురం ఇమ్మిడివరప్పాడు వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పౌష్టికాహారం సమకూర్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.మనోహర్, కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ కె.నరసింహరావు, ఏవో కరాటం ప్రవీణ్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### మహిళకు పాము కాటు

**ముమ్మిడివరం:** ముమ్మిడివరం మండలం లంకాఫ్ ఠానేల్లంకలో వరద నీటిలో కొట్టుకొచ్చిన పాము ఓ మహిళను కాటేసింది. గ్రామానికి చెందిన జల్లి లక్ష్మి(45) సోమవారం పాము కాటుకు గురి కావడంతో ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి వైద్యుల సూచన మేరకు కాకినాడలోని ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతుంది.

## సంక్షిప్తంగా

### దేవస్థానంలో సమస్యలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

**తాళ్లరేవు:** కేశవస్వామి వారి దేవస్థానంలో నెలకొన్న సమస్యలు, ఈఓ, ఉద్యోగస్తుల అలసత్వంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆలయ చైర్మన్ కొల్లు శ్రీను తెలిపారు. ఆలయంలో జరుగుతున్న వ్యవహారాలపై విచారణ చేపట్టాలని కోరానన్నారు.

### ఇరువర్గాలపై కేసులు

**అమలాపురం టౌన్:** స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకున్న వివాదంలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ డి.దుర్గాశేఖరరెడ్డి తెలిపారు. ఆలయ ఆవరణలో తనపై ఆలయ చైర్‌పర్సన్ భర్త దూడల ఫణి దాడిచేశారంటూ భక్తుడు కట్టా నారాయణమూర్తి ఇచ్చిన ఫిర్యాదుపై, తమపై భక్తుడు నారాయణమూర్తి దౌర్జన్యం చేశాడన్న ఆలయ సిబ్బంది ఫిర్యాదుపై రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

### రేకాడి సేవలు ప్రశంసనీయం

**యానాం:** యానాం పోలీస్‌శాఖలో సీనియర్ గ్రేడ్ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా సేవలందించిన రేకాడి నాగేశ్వరరావు సేవలు ప్రశంసనీయమైనవని ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి పేర్కొన్నారు. పోలీసు శాఖలో హోంగార్డుగా, కానిస్టేబుల్‌గా, ఏఎస్‌ఐగా సుమారు 33 ఏళ్ల పాటు పనిచేసిన రేకాడి నాగేశ్వరరావు ఉద్యోగ విరమణ సత్కార సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం దుశ్శాలువాతో ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీఐ షణ్ముగం, ఎస్ఐ ఎస్.నూకరాజు, విశ్రాంత సీఐ శివగణేష్, ఎస్ఐ కె.సుబ్బరాజు, నూకరాజు పాల్గొన్నారు.

### ఇంటింటికీ కుళాయిలు వేయాలి

**ఉప్పలగుప్తం:** మండలంలోని గోకనవిల్లి గ్రామంలో కాంట్రాక్టర్ మధ్యలో వదిలేసిన జలజీవన్ మిషన్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ఇంటింటికీ కుళాయిలు వేయాలని గ్రామస్తులు సోమవారం స్పందనలో ఫిర్యాదు చేశారు. గ్రామంలో రూ.6.5 లక్షల నిధులతో ఏర్పాటు చేస్తున్న జలజీవన్ మిషన్ పనులు పైపులైను వేసి కనెక్షన్ ఇవ్వకుండా కుళాయిలు వేయకుండా వదిలేయడంతో తాగునీటికి ఇబ్బంది పడుతున్నామన్నారు. శంకుస్థాపన చేసి 11 నెలలవుతున్నా పనులు మాత్రం ముందుకు సాగడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

### శ్రీనివాస్ సేవలు ప్రశంసనీయం

**యానాం:** యానాం విద్యాశాఖలో సుమారు 35 ఏళ్ల పాటు తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేసిన బాలాంత్రపు శ్రీనివాస్ సేవలు ప్రశంసనీయమైనవని విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక మెట్టకూరు ప్రభుత్వ హైస్కూల్‌లో జరిగిన శ్రీనివాస్ ఉద్యోగ విరమణ సత్కార సభకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు మాతృభాషలోని మాధుర్యాన్ని తెలిసే విధంగా తన బోధనతో అందరి మన్ననలు పొందారని శ్రీనివాస్‌ను దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### వేలం పాట రద్దుపై హర్షం

**ఐ.పోలవరం:** అన్నవరం దేవస్థానంలో పురోహితులకు నిర్వహించాలనుకున్న వేలం పాట రద్దుపై ఏపీ బ్రాహ్మణ సమాఖ్య హర్షం వ్యక్తం చేసింది. అన్నవరం సత్యనారాయణమూర్తి ఆలయంలో వివాహ తంతు చేసే పురోహితులు సింగిల్ విండో పథకంలో వేలం పాటలు నిర్వహించాలని దేవస్థాన అధికారులు తీసుకున్న నిర్ణయాన్ని ఏపీ బ్రాహ్మణ సమాఖ్య వ్యతిరేకించింది. దీనిపై సానుకూలంగా స్పందించిన నాయకులు, అధికారులు వేలం పాటను రద్దు చేసే విధంగా చర్యలు తీసుకొన్నారు. దీనిపై సమాఖ్య రాష్ట్ర అధికార ప్రతినిధి నాగాభట్ల రవి శర్మ అధికారులకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

### విద్యుత్ ఉద్యోగుల నిరసన

**అమలాపురం టౌన్:** విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బందిలో ఉద్యోగాల రీత్యా నెలకొన్న అభద్రతా భావాన్ని తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆ శాఖ ఉద్యోగులు స్థానిక గడియారం స్తంభం సెంటరులో సోమవారం నిరసన తెలిపారు. విద్యుత్ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ఆ సంస్థే నేరుగా జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని గడియారం స్తంభం సెంటరులోని మహాత్మాగాంధీ విగ్రహానికి అందజేశారు. ఏపీ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం జరిగింది.